

టీఆర్‌టీ కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నల్లకుంట డివిజన్ అభివృద్ధికి కృషి

● ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నల్లకుంట, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): నల్లకుంట డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నామని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. మంగళవారం డివిజన్‌లోని టీఆర్‌టీ క్వార్టర్‌లో పాదయాత్ర చేసి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలకు అడ్డుగా ఉండడంతో వర్షాల నేపథ్యంలో తరచూ విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వీధి దీపాలు వెలగక రాత్రి వేళ అంధకారం నెలకొంటుందన్నారు. చెట్లకొమ్మలను తొలగించి, వీధి దీపాలకు మరమ్మతులు చేయాలని విద్యుత్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. జీహెచ్ఎంసీ ఏఎంహెచ్‌వో డాక్టర్ హేమలత, టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఏఈ పృథ్వీరాజ్, హార్టికల్చర్ మేనేజర్ భాస్కర్, ఏఈ ఫయాజ్, జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ నరేందర్ పాల్గొన్నారు.



అధికారులతో కలిసి పర్యటిస్తున్న కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్

కచ్చా నాలా పైప్‌లైన్ పనులను ప్రారంభించండి

చిక్కడపల్లి, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీక్రాస్‌రోడ్‌లో లక్ష్మీగణపతి దేవాలయం నుంచి టీఆర్‌టీ జవహర్‌నగర్ మెయిన్‌రోడ్ మీదుగా కచ్చా నాలా పైప్‌లైన్ పనులను వెంటనే ప్రారంభించాలని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ. పావని వినయ్‌కుమార్ అధికారులకు సూచించారు. మంగళవారం ఆ ప్రాంతంలో పర్యటించారు. బుధవారం నుంచి పనులను ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ అబ్దుల్ సలామ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్, జలమండలి డీజీఎం కార్తీక్‌రెడ్డి, మేనేజర్ కృష్ణమోహన్, వర్క్ సూపర్‌వైజర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

31 నుంచి రైతు సంఘం రాజకీయ శిక్షణ తరగతులు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సాగర్, మల్లారెడ్డి

చిక్కడపల్లి, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర స్థాయి రాజకీయ శిక్షణ తరగతులు ఈనెల 31 నుంచి వచ్చేనెల 2 వరకు రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం, రాందాసుపల్లి స్టేజ్ దగ్గర గల శుభమ్ గార్డెన్‌లో నిర్వహిస్తున్నామని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్ తెలిపారు. మంగళవారం సంఘం కార్యాలయంలో శిక్షణ తరగతుల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కేంద్ర వ్యవసాయ రంగంలో తీసుకొస్తున్న మార్పులు, వాతావరణంలో వస్తున్న మార్పులు, రైతులు, రైతు సంఘం కార్యకర్తలు తీసుకోవాల్సిన చర్యలు శిక్షణ తరగతుల్లో చర్చిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అఖిలభారత కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి, అరిబండి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.



సర్వేలో పాల్గొన్న అంబర్‌పేట ప్రజా సంక్షేమ సంఘం సభ్యులు

వృద్ధులకు పౌష్టికాహారంపై సర్వే

అంబర్‌పేట, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): వృద్ధులకు పౌష్టికాహారంపై అంబర్‌పేటలో మంగళవారం సర్వే నిర్వహించారు. ఐసీఎంఆర్, ఎన్ఐఎన్ ఆధ్వర్యంలో అంబర్‌పేట ప్రజా సంక్షేమ సంఘం సభ్యులు స్థానికంగా 65 సంవత్సరాలు పై బడిన వారికి పౌష్టికాహారంపై వృద్ధులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లక్ష్మీప్రసన్న, డాక్టర్ సుబ్బారావు, ఫాతిమా, ప్రజా సంక్షేమ సంఘం అధ్యక్షుడు నవీన్‌రెడ్డి, సభ్యులు రాజు, భగవంత్, వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పల్లా రాజేశ్వరరావు

భక్తసింగ్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తాం

చిక్కడపల్లి, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): గోల్కొండ చౌరస్తాలోని హెబ్రోను చర్చి వ్యవస్థాపకుడు బ్రదర్ భక్తసింగ్ ఆశయాలకు అనుగుణంగా అంతా కలిసికట్టుగా పనిచేస్తామని హెబ్రోను ట్రస్టు, సొసైటీ ప్రతినిధులు వై. జాన్ సుబ్బారెడ్డి, జోసెఫ్ కురియన్, మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వరరావు తెలిపారు. కొన్నేళ్లుగా హెబ్రోను చర్చి సొసైటీ, ట్రస్టు సభ్యుల మధ్య కొనసాగుతున్న విబేధాల నేపథ్యంలో మంగళవారం మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వరరావు అధ్యక్షతన ఇరువర్గాలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో బెనహర్‌తోపాటు హెబ్రోను సంఘాల విశ్వాసులు, దైవసేవకులు పాల్గొన్నారు.

నేషనల్ హ్యూమన్‌రైట్స్ ఉమెన్ చైల్డ్ డెవలప్‌మెంట్ కమిషన్

రాష్ట్ర అధ్యక్షుడిగా నవరతన్ ఇందోరియా

బర్కత్‌పుర, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హ్యూమన్‌రైట్స్ ఉమెన్ చైల్డ్ డెవలప్‌మెంట్ కమిషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా నవరతన్ ఇందోరియా నియమితులయ్యారు. మంగళవారం కాచిగూడలోని వీఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని కార్యాలయంలో ఆయనను బజరంగ్‌సేన రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు, బీజేపీ నాయకుడు గోవింద్ రాఠి సత్కరించారు.

ఈ సందర్భంగా నవరతన్ ఇందోరియా మాట్లాడుతూ.. మానవ హక్కులు, బాలల హక్కులపై తమ సంస్థ విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బాలాజీ, సంజయ్ వాడేకర్, నరేష్, గిరీష్ జోషి తదితరులు పాల్గొన్నారు.



నవరతన్ ఇందోరియాను సత్కరించిన బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు తదితరులు

డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి

నల్లకుంట, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని జలమండలి అధికారులకు కార్పొరేటర్ బి. పద్మావెంకట్‌రెడ్డి సూచించారు. సాయికాంప్లెక్స్ బతుకమ్మకుంటలో పదిహేను రోజుల నుంచి డ్రైనేజీ సమస్యతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. మంగళవారం బతుకమ్మకుంటలో పర్యటించి ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. తిలక్‌నగర్ సిగ్నల్స్ వద్ద డ్రైనేజీ సమస్యను పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బి. వెంకటరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు జమ్మిచెట్టి బాలరాజు, కె. శ్రీహరి, చంద్రశేఖర్, రమేష్, అర్జున్, సూర్యవంశీ, మహేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కవాడిగూడలో..

కవాడిగూడ, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): కొత్త బజార్, భాగ్యలక్ష్మి నగర్ కాలనీ, చిత్రాలనగర్‌లో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని బీజేపీ కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు ఎంసీ మహేందర్‌బాబు వాటర్‌వర్క్స్ బోట్స్‌క్లబ్ డీజీఎం కార్తీక్‌రెడ్డిని కోరారు. మంగళవారం దోమలగూడ ఎల్ఐసీ కార్యాలయం వద్ద గల వాటర్‌వర్క్స్ కార్యాలయంలో డీజీఎం, మేనేజర్ శ్రీధర్‌తో సమావేశమయ్యారు. నిత్యం డ్రైనేజీలు పొంగడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పైపులైన్‌కు ప్రతిపాదనలు పంపిస్తే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తన బడ్జెట్ నుంచి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు జి. వెంకటేష్ పాల్గొన్నారు.



తిలక్‌నగర్ సిగ్నల్స్ వద్ద డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బి. పద్మావెంకటరెడ్డి

యాదవ సంఘాల ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలు

బర్కత్‌పుర, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో మంగళవారం పలు ప్రాంతాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. చప్పల్‌బజార్‌లో యాదవ సంఘం కార్యాలయంలో సంఘం గ్రేటర్ చైర్మన్ పి. నందకిషోర్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గోపూజ, గో సేవ, విష్ణు లలిత సహస్రనామ పారాయణం, కృష్ణభగవాన్ పూజా కార్యక్రమం, భజన, కృష్ణ డోలారోహణం నిర్వహించారు. యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కవాడిగూడలో..

కవాడిగూడ: దోమలగూడ హనుమాన్ దేవాలయంలో అఖిలభారత యాదవ మహాసభ ముషీరాబాద్ నియోజకవర్గం అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. రాజ్యసభ సభ్యుడు ఎం. అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్లు జి. రచనశ్రీ, కె. రవిచారి, కన్నె ఉమాదేవి, యాదవ మహాసభ నగర అధ్యక్షుడు మహేందర్ యాదవ్, జాతీయ కార్యదర్శి ఆర్. లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

> **వేంకటేశ్వరస్వామి ఆలయంలో**
>
> **31 వరకు వేడుకలు**
>
> **చిక్కడపల్లి:** వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈనెల 31 వరకు ఉత్సవాలు జరుగుతాయని ఆలయ వ్యవస్థాపక వంశీయుడు జి. రాజేంద్రనాథ్ కుమారుడు శ్రీనాథ్‌గౌడ్, ఈవో రామాంజనేయులు తెలిపారు. 29వ తేదీ రాత్రి ఉట్టికొట్టే కార్యక్రమం జరుగుతుందన్నారు.



చప్పల్‌బజార్‌లో కృష్ణాష్టమి వేడుకల్లో నందకిషోర్ యాదవ్ తదితరులు

అంబర్‌పేటలో..

అంబర్‌పేట: అన్నపూర్ణనగర్, చెన్నారెడ్డినగర్‌లో మంగళవారం కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో బీజేవైఎం సెంట్రల్ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్, యాదవ సంఘం జాతీయ నాయకులు రాములు, లక్ష్మణ్ యాదవ్‌లు, కార్పొరేటర్లు విజయకుమార్ గౌడ్, వై. అమృత, కన్నె ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

కవితకు బెయిల్‌పై బీఆర్ఎస్ హర్షం

రాంనగర్, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కవితకు సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేయడంపై బీఆర్ఎస్ పార్టీ గ్రేటర్ సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముచ్చకూర్తి ప్రభాకర్ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్టీసీ క్రాస్ రోడ్‌లో సంబరాలు నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు స్వీట్లు తినిపించుకుని ప్రజలకు పంపిణీ చేశారు.

బాణసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ

చిక్కడపల్లి: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు బెయిల్ మంజూరుపై హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం ఆర్టీసీక్రాస్‌రోడ్‌లో బీఆర్ఎస్ శ్రేణులు సంబరాలు నిర్వహించాయి. బాణసంచా కాల్చి స్వీట్లు పంచారు. కవిత జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో దీన్‌దయాళ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాకేష్‌కుమార్, అరుణ్, వల్లాల శ్యామ్‌యాదవ్, శివ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో బాణసంచా కాలుస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

ముషీరాబాద్‌లో..

ముషీరాబాద్: ఎమ్మెల్సీ కవితకు సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో రాజాడీలక్స్ చౌరస్తాలో ప్రజలకు మంగళవారం స్వీట్లు పంపిణీ చేశారు. డివిజన్ అధ్యక్షుడు వై. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కవితను రాజకీయంగా దెబ్బతీసేందుకే ఢిల్లీ లిక్కర్ స్కాంలో అరెస్ట్ చేశారని ఆరోపించారు. బీఆర్ఎస్ మైనార్టీ కమిటీ రాష్ట్ర నాయకుడు రహీం, డివిజన్ ఉపాధ్యక్షుడు చాంద్‌పాషా, యువజన కమిటీ డివిజన్ అధ్యక్షుడు సాయికుమార్, మీడియా సెల్ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.



స్వీట్లు పంపిణీ చేస్తున్న వై. శ్రీనివాసరావు



స్వీట్లు తినిపించుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు

సమస్యలను పరిష్కరించాలని ఇంజనీర్ల నిరసన

పంజాగుట్ట, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని విద్యుత్‌సంస్థల్లో పనిచేస్తున్న ఇంజనీర్ల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ అసోసియేషన్(టీజీపీఈఏ), తెలంగాణ ఎంప్లాయీస్ అసిస్టెంట్ ఇంజనీర్స్ అసోసియేషన్(టీజీఈఏఈఏ) నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం భోజన విరామ సమయంలో జీటీఎస్‌కాలనీలోని మెట్రోజోన్ చీఫ్ ఇంజనీర్, చీఫ్ ఇంజనీర్ రూరల్ జోన్ కార్యాలయం ఎదుట వివిధ క్యాడర్లలో పనిచేస్తున్న ఇంజనీర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ట్రాన్స్‌కోలో ప్రస్తుత నిబంధనలు, వర్క్ లోడ్‌కు అనుగుణంగా అదనపు పోస్టులు మంజూరు చేసి, అన్ని క్యాడర్లలో ఇంజనీర్లకు పదోన్నతులు కల్పించాలని, 2012 బ్యాచ్ ఏఈలకు ఏడీఈలుగా పదోన్నతులు ఇవ్వాలని, ఏఈ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రామగుండంలో నిర్మించబోయే జనరేషన్ ప్లాంట్‌ను టీజీ జెన్‌కో ఆధ్వర్యంలో నిర్మించాలని, ఎనిమిది నెలలుగా పెండింగ్‌లో ఉన్న డైరెక్టర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు.

కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు వెంకటనారాయణరెడ్డి, కిరణ్‌కుమార్, కిషోర్‌కుమార్, వెంకటేశ్వర్, భాస్కర్‌రావు, వెంకటేశ్వర్లు, కుమారస్వామి, నరేష్, దామోదర్, వెంకటరమణ, రాంకోటి, బ్రహ్మారెడ్డి, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఇంజనీర్లు

సెప్టెంబర్ 26 నుంచి ఇన్వెస్టర్ కనెక్ట్ వర్క్‌షాప్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ స్టార్టప్ ఫౌండేషన్, ఇంటర్నేషనల్ స్టార్టప్ నెట్‌వర్క్ ప్రైవేట్ లిమిటెడ్ (ఐఎస్ఎన్)తో కలిసి అంతర్జాతీయ స్టార్టప్ ఫెస్టివల్(ఐఎస్ఎఫ్) 2024ను హైదరాబాద్‌లో తొలిసారి నిర్వహించేందుకు సిద్ధమైంది. సెప్టెంబర్ 26 నుంచి 28 వరకు గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో నిర్వహించనున్నారు. ఐఎస్ఎఫ్ 2024 కోసం ఇన్వెస్టర్ కనెక్ట్ వర్క్‌షాప్, కర్టెన్ రైజర్ కార్యక్రమం మంగళవారం టీ-హబ్‌లో జరిగింది. ఐఎస్ఎఫ్ ఫౌండర్ జేపీ చౌదరి, ఐఎస్ఎఫ్ నెట్‌వర్క్ డైరెక్టర్ డాక్టర్ శివ మహేష్ టంగుటూరు, ఫిక్కీ ఫ్లో ఛైర్‌పర్సన్ ప్రియా గజ్దర్ తదితరులు పాల్గొన్నారు. ఐఎస్ఎఫ్‌ను 'ఏఐ యుగంలో ఆవిష్కరణ, వ్యవస్థాపకత' నేపథ్యంతో హెల్త్‌కేర్, ఎడ్యుకేషన్, అగ్రిటెక్, ఫుడ్ టెక్నాలజీ, ఫిన్‌టెక్, రూరల్ ఇన్నోవేషన్స్‌తో సహా వివిధ రంగాలలో ఆవిష్కరణలను చేయడానికి కృత్రిమ మేధస్సుపై దృష్టి సారించి నిర్వహించనున్నామని జేపీ చౌదరి అన్నారు. ఐఎస్ఎఫ్ నెట్‌వర్క్ డైరెక్టర్ డాక్టర్ శివ మహేష్ టంగుటూరు మాట్లాడుతూ.. 'ఐఎస్ఎఫ్‌లో ఇండియా, యూఎస్ఏ తదితర దేశాల నుంచి స్టార్టప్‌లు పాల్గొంటాయని తెలిపారు.




లలిత సహస్రనామ పారాయణంలో మహిళలు

భవానీ ఆలయంలో ప్రత్యేక పూజలు

చిక్కడపల్లి, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాస పూజల్లో భాగంగా మంగళవారం వివేక్‌నగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలోని భవానీ మందిరంలో అమ్మవారు భక్తులకు శాకంబరి అలంకారంలో దర్శనమిచ్చారు. ఆలయ ముఖ్యఅర్చకులు బుగ్గా లక్ష్మీపతి శర్మ ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని లలితాసహస్రనామ పారాయణం కార్యక్రమం నిర్వహించారు. ఈవో మాచర్ల దేవనాథం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రేపు హలో 'బీసీ - చలో హైదరాబాద్'

బర్కత్‌పుర, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్‌లను 42శాతం పెంచడంపై సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టమైన ప్రకటన చేయాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. మంగళవారం కాచిగూడలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణ, రాష్ట్ర కన్వీనర్ లాల్‌కృష్ణ ఆధ్వర్యంలో బీసీ సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ.. ఈనెల 29న హలో బీసీ - చలో హైదరాబాద్ పేరుతో లక్డీకపూల్‌లోని సెంట్రల్ కోర్టులో జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలను, బీసీ సంఘాలను ఈ సదస్సుకు ఆహ్వానిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేపట్టకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. విద్య, ఉద్యోగ రంగాలలో బీసీ రిజర్వేషన్లను 56 శాతానికి పెంచాలని, ప్రైవేటు రంగంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని, కేంద్రంలో ఖాళీగా ఉన్న 16లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ సంఘాల నేతలు నందగోపాల్, వేముల రామకృష్ణ, ఉదయ్‌నేత, జోషి, రాఘవకుమార్, కోటేశ్వరి, రిషి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో అభివాదం చేస్తున్న ఆర్.కృష్ణయ్య, గుజ్జకృష్ణ, లాల్ కృష్ణ తదితరులు

లేబర్ కమిషనరేట్ ఎదుట కార్మికుల ధర్నా

చిక్కడపల్లి, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డులో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను టెండర్ ద్వారా ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించాలనే ప్రతిపాదనను విరమించుకోవాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ డిమాండ్ చేశారు. బిల్డింగ్, అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కార్మిక కమిషనరేట్ ఎదుట కార్మికులు మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోర్డు అడ్వైజరీ కమిటీని నియమించి నిధులు దుర్వినియోగం కాకుండా కార్మికుల సంక్షేమం కోసమే ఖర్చు చేయాలని కోరారు. 1996 చట్టం ప్రకారం వెల్ఫేర్ బోర్డు ద్వారానే నిధులను కార్మికులకు అందించాలని కోరారు. ధర్నాలో డీఎల్ మోహన్, కె. జంగయ్య, జె. వెంకన్న, చిట్టెన్న, రాజు, లక్ష్మయ్య, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సంగీత విభావరి

చిక్కడపల్లి, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): పోతన భాగవత సేవాట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీలీలాకృష్ణా స్వరనిధి సమర్పణలో మంగళవారం త్యాగరాయగానసభలో నిర్వహించిన సంకీర్తనలు, పద్యాలు, గీతాలాపన శ్రోతలను ఆకట్టుకుంది. సంగీత విభావరి - 4 శీర్షికతో నిర్వహించిన కార్యక్రమంలో రుక్మిణి, లక్ష్మి, రమాదేవి, మాధురి, రమాదేవి, లక్ష్మి, సీత, సీతారామారావు, సుబ్బిరెడ్డి, ప్రదీప్‌చంద్ర, చంద్రశేఖరరావు, శేషగిరిరావు, రాజేష్, శోభన్ గీతాలు మధురంగా ఆలపించారు. నంది అవార్డుగ్రహీత అనిల ఆధ్వర్యంలో అనిల ఆర్ట్స్ అకాడమి బాల కళాకారులు బృందనృత్యాలు ప్రదర్శించారు.. సంస్థ గౌరవ సలహాదారు గట్టుపల్లి సీతారామారావు, పోతన భాగవత సేవాట్రస్ట్ అధ్యక్షురాలు ఎం. రుక్మిణి, నిర్వాహక కార్యదర్శి ఆర్. లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ కాశీవిశ్వేశ్వరరావు, చిత్రంలో కళా జనార్దనమూర్తి తదితరులు

తెలుగు భాష వైతాళికుడు గిడుగు రామ్మూర్తి

చిక్కడపల్లి, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): వ్యవహార భాష అందాన్ని, ఆ భాషను వాడే విధానాన్ని తెలిపిన మహనీయుడు గిడుగు రామ్మూర్తిపంతులు అని రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ కాశీవిశ్వేశ్వరరావు అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి వ్యవహారిక భాషోద్యమ సారథి గిడుగు రామ్మూర్తి పంతులు యాదిలో కార్యక్రమం గానసభలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జస్టిస్ కాశీవిశ్వేశ్వరరావు మాట్లాడుతూ.. తెలుగు భాష వైతాళికుడు గిడుగు రామ్మూర్తి పంతులు అని అన్నారు. గ్రాంధిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాషలోకి తీసుకువచ్చారన్నారు. నాలుగు దశాబ్దాలకు పైగా వ్యవహారిక భాషోద్యమం కోసం గ్రాంధిక వాదులతో అలుపెరగని పోరాటం చేశారన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి, ప్రముఖ సాహితీవేత్త రమణ వెలమకన్ని, బండి శ్రీనివాస్ పాల్గొన్నారు.



చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేసిన నాగేశ్‌ముదిరాజ్

సాంస్కృతిక అంశాల్లో తర్ఫీదుతో ఏకాగ్రత పెంపు

చిక్కడపల్లి, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): సాంస్కృతిక అంశాల్లో తర్ఫీదు ఏకాగ్రత, సమయస్ఫూర్తి పెంచుతాయని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత ఎం. నాగేశ్‌ముదిరాజ్ అన్నారు. తెలంగాణ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి త్యాగరాయగానసభలో నిర్వహించిన కృష్ణాష్టమి వేడుకలు ఆకట్టుకున్నాయి. చిన్నారులు కృష్ణుడి వేషధారణలో పాల్గొన్నారు. కొందరు చిన్నారులు కృష్ణాష్టమి వేడుకల గీతాలను ఆలపించారు. ఈ సందర్భంగా గురువును సత్కరించారు. నాగేశ్ ముదిరాజ్ చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేశారు. అన్నిరంగాల్లో రాణించేలా పిల్లలను తీర్చిదిద్దాలని తల్లిదండ్రులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో నిర్వాహకులు విక్కీమాస్టర్, రిటైర్డ్ జడ్జి మధుసూదన్ పాల్గొన్నారు.

హైడ్రా రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలి



మాట్లాడుతున్న పి. సాయిబాబా

రాంనగర్, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): చెరువుల్లో అక్రమ నిర్మాణాలపై హైడ్రా చర్యలు తీసుకోవడాన్ని టీడీపీ స్వాగతిస్తుందని ఆ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి. సాయిబాబా అన్నారు. మంగళవారం టీడీపీ నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైడ్రా రాజకీయాలకు అతీతంగా వ్యవహించాల్సిన అవసరం ఉందన్నారు. దానికి చట్టబద్ధత కల్పించాలన్నారు. హైదరాబాద్ నగర అభివృద్ధికి ఆటంకంగా మారుతున్న ప్రభుత్వ స్థలాల కబ్జా, చెరువుల ఆక్రమణలను తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, పి. బాల్‌రాజ్ గౌడ్, నాయకుడు ఎస్. ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు కేటాయించండి

● మంత్రి పొన్నం ప్రభాకర్‌కు జర్నలిస్టుల సంఘం వినతి

నల్లకుంట, ఆగస్టు 27 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశాన్ని సీఎం, మంత్రివర్గం దృష్టికి తీసుకెళ్తానని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తమ సొసైటీకి ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యాచువల్లీ ఎయిడెడ్ కో - ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు మంగళవారం సచివాలయంలో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు.

అనంతరం హైదర్‌గూడలో సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్య, కార్యదర్శి బి. శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడారు. సొసైటీలో దాదాపు 1400 మంది జర్నలిస్టులు ఉన్నారని, వీరిలో చాలామంది సీనియర్‌లు ఇళ్ల స్థలాల కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. మంత్రిని కలిసిన వారిలో సొసైటీ ప్రతినిధులు పి. ఆనందం, సీతారామరాజు, వీరారెడ్డి, పి. నాగమణి, వేముల పుష్పలత, డి. వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.